సాక్షి
నల్లగొండ

మంగళవారం । 3 । అక్టోబర్ । 2023



ఉద్యమ స్ఫూర్తి.. వక్కవంతుల

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి వక్కవంతుల విజయ్‌కుమార్ అని సాహిత్య అకాడమీ చైర్మన్ గౌరీశంకర్ అన్నారు.

- 8లో



ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలి

రానున్న ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలని సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి అన్నారు.

- 8లో



యాదాద్రిలో భక్తుల రద్దీ

వరుస సెలవులు రావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో యాదాద్రి పుణ్యక్షేత్రం కిటకిటలాడుతోంది.

- 8లో

న్యూస్‌రీల్

ఐటీ విధానంపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

నల్లగొండ : సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఐటీ విధానంపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్వోలు, ఏఆర్వోలు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాటా ఎంట్రీ విధానంలో ఎక్కడా తప్పులకు ఆస్కారం ఉండొద్దన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం పోల్ ప్రిపరేషన్‌పై చర్చించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, హేమంత్ కేశవ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు గాంధీజీ



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ కర్ణన్, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తదితరులు

నల్లగొండ టౌన్ : తెల్లదొరల నుంచి అహింసా పద్ధతిలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహనీయుడు జాతిపిత గాంధీజీ అని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ కొనియాడారు. సోమవారం గాంధీజీ 154వ జయంతి సందర్భంగా స్థానిక రామగిరి గాంధీ పార్కులో గల గాంధీజీ విగ్రహానికి కలెక్టర్ కర్ణన్.. నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ కలలను సాకారం కావాలంటే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, సుంకరి మల్లేష్‌గౌడ్, యామకవిత, శరణ్యారెడ్డి, కమిషనర్ రమణాచారి పాల్గొన్నారు.

జిల్లా ఏర్పాటు ఉద్యమంలో భాగస్వాములు కావాలి



దీక్షకు మద్దతు తెలుపుతున్న రైస్ మిల్లర్స్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ జిల్లా ఏర్పాటు కోసం జరిగే ఉద్యమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ అసోసియేషన్ అధ్యక్షులు గౌరు శ్రీనివాస్, కోశాధికారి చిల్లంచర్ల శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎన్‌టీఆర్ కాంప్లెక్స్ మిర్యాలగూడ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండవ రోజు కొనసాగింది. ఈ దీక్షలో గాజుల పున్నమ్మ, మురళి యాదవ్, కవిత, ఉషానాయక్, దశరథనాయక్, గుడిపాటి కోటయ్య, తాళ్లపల్లి వినయ్, బంటు రమేష్ కూర్చున్నారు. ఈ దీక్షలకు పలు సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జం సాయి, మాదుగుల శ్రీనివాస్, నగేష్, బాబురావు, మధు, జోసెఫ్, జయరాజు, సైదులు, రాజేష్, రమేష్, యదిలాల్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, రాంబాబు నాయక్, చోటు, గోవర్ధన్, శ్రీనివాస్, రాజు, శ్యాం, దావిద్, రమేష్ తదితరులున్నారు.

అర్చకుల శిక్షణ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహాచార్యులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలోని టీఎన్‌జీఓ భవనంలో దూప దీప నైవేద్య పథకం అర్చకులకు పునరుచ్చరణ శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో అర్చకులకు ఆగమన నియమాలపై శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం.మహేంద్రకుమార్, అర్చకులు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, పోతులపాటి రామలింగేశ్వరశర్మ, పద్మనాభ చార్యులు, శ్రవణ్‌కుమారచార్యులు, దౌలాతాబాద్ వాసుదేవ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండలో ఐటీ హబ్ చిత్రాన్ని చూపుతున్న కేటీఆర్



నల్లగొండలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో ప్రగతి నివేదన సభకు హాజరైన జనం



నల్లగొండ మారింది

> రూ.1,350 కోట్లతో నల్లగొండ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను చేపట్టాం.. 60 ఏళ్లలో మంత్రులుగా ఉన్న వారు చేయని పనులను ఒక్క ఎమ్మెల్యే చేశారు. అభివృద్ధి అంటే ఇది కదా.. మీరంతా ఒకటే ఆలోచించాలి.. తెలంగాణ రాకపోతే ఈ పనులు అయ్యేవా? కాంగ్రెస్ ఉంటే ఈ అభివృద్ధి జరిగేదా? గుండెమీద చేయి వేసుకొని ఆలోచించండి.
>
> – నల్లగొండ ప్రగతి నివేదన సభలో ఐటీ మంత్రి కేటీఆర్

- 60 ఏళ్లలో కాంగ్రెస్ నేతలు ఏం చేశారు?
- గతంలో మంత్రులుగా ఉన్న వారు చేయనిది ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చేశారు
- కేసీఆర్ దత్తతతో నల్లగొండ రూపురేఖలు మారాయి
- తాగు, సాగునీరు ఇచ్చాం.. ఫ్లోరైడ్ భూతాన్ని తరిమేశాం
- నల్లగొండ, సూర్యాపేట సభల్లో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ, సూర్యాపేట : బీఆర్‌ఎస్ హయాంలోనే ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధిచెందిందని మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. సూర్యాపేట, నల్లగొండ జిల్లా కేంద్రాల్లో సోమవారం ఆయన పలు అభివృద్ధి పనులకు మంత్రి జగదీష్‌రెడ్డితో కలిసి శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ మాట్లాడారు. కవులు, కళాకారులు, రచయితలకు నెలవైన నల్లగొండలో రూ.93 కోట్లతో కళాభారతి, రూ.90 కోట్లతో ఐటీ టవర్ మంజూరు చేశామన్నారు. రూ.150 కోట్లతో రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్, పాలిటెక్నిక్ కాలేజీ నుంచి ఉదయ సముద్రం వరకు రోడ్డు, రూ.75 కోట్లతో ట్యాంక్ బండ్ సుందరీకరణ, రూ.46 కోట్లతో మర్రిగూడ బైపాస్, రూ.216 కోట్లు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఇలా నల్లగొండ పట్టణంలోనే అనేక అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మెడికల్ కాలేజీ తెస్తానని, ఐటీ కంపెనీలు తెస్తామని చెప్పి.. ఒక్క కంప్యూటర్ కూడా కొనలేదని ఎద్దేవా చేశారు. ఒక ఎమ్మెల్యేగా ఉండి భూపాల్‌రెడ్డి ఐటీ హబ్ నిర్మించారని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రి, అన్ని జిల్లా కేంద్రాలకు మెడికల్ కాలేజీలను ఇచ్చిన ఏకైక సీఎం కేసీఆర్ మాత్రమేనన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాకే నల్లగొండ రూపురేఖలు మారాయన్నారు. ఈ అభివృద్ధిని చూసి గతంలో కంటే 60 –70 వేల మెజారిటీతో భూపాల్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. భూపాల్‌రెడ్డి అంగవైకల్యంపై మాట్లాడారని, భూపాల్ పనితీరు చూసి వెంకట్‌రెడ్డి నెత్తి, మెదడు పాడైందన్నారు. మాకంటే పొడుగ్గా ఉన్న జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పెద్ద పదవులు వెలగబెట్టినా జిల్లాకు ఏం చేశారని ప్రశ్నించారు. ఫ్లోరోసిస్‌తో ప్రజలు బాధ పడుతుంటే.. వాజ్‌పేయి టేబుల్‌పై అంశాల స్వామిని పడుకోబెట్టినా బీజేపీ పట్టించుకోలేదని, కాంగ్రెస్ కరుణ చూపలేదన్నారు. బీఆర్‌ఎస్ వచ్చాకే ఫ్లోరోసిస్ బాధ తొలగించామన్నారు. కనగల్, తిప్పర్తి, మాడ్గులపల్లిలో కూడా రోడ్లకు రూ.26 కోట్లు మంజూరు చేయిస్తానని, ఆ బాధ్యత తనదేనని, పనిచేసే ఎమ్మెల్యేను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదని కేటీఆర్ అన్నారు.



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రులు

జగదీష్‌రెడ్డి ఆలోచన భేష్..

సూర్యాపేటలో 18 మంది దళిత కుటుంబాలు రోడ్డుపై చెప్పులు కుట్టుకుంటున్నాయని.. వారికి దళితబంధు ఇవ్వాలని మంచి ఆలోచన చేసిన ఏకైక మంత్రి జగదీష్‌రెడ్డి అని కొనియాడారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ పరిస్థితి ఎలా ఉండేదో ప్రజలంతా ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు.. విత్తనాలు, ఎరువుల కోసం లైన్‌లో చెప్పులు పెట్టి ఎండలో కాళ్లు కాలుతుండగా, మాడిపోతున్న కడుపులతో నిరీక్షించిన దుస్థితి ఉండేదన్నారు. పోలీస్ స్టేషన్లలో విత్తనాలు పంపిణీ చేసిన రోజులను మర్చిపోతామా.. అని పేర్కొన్నారు. కరెంట్, మంచినీళ్లు ఇవ్వని ముఖాలు.. ఎస్సారెస్పీ చివరి ప్రాంతాలైన సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడకు సాగు నీరు ఇవ్వని కాంగ్రెసోళ్లు.. ఇవాళ కేసీఆర్ వచ్చి సాగునీరు, కరెంటు, ఇంటింటికి మంచినీళ్లు ఇస్తుంటే ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆయా కార్యక్రమాల్లో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్లు బండ నరేందర్‌రెడ్డి, గుజ్జ దీపిక, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, ఎన్.భాస్కర్‌రావు, నోముల భగత్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, గాదరి కిషోర్‌కుమార్, శానంపూడి సైదిరెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై కేటీఆర్ పిట్టకథ

నల్లగొండ సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. అత్తా, కోడలు కథ చెప్పారు. 'ఒక 130 ఏళ్ల ముసలమ్మ తన ముని మనవడు/మనరాలి కోసం చేతితో కుల్ల కుడుతోంది. దారం నుంచి సూది ఊడి కింద పడిపోయింది. వెదికినా దొరకలేదు. పక్కన దేవుడి పాటో కనిపించింది. వెంటనే ఐదు నిమిషాల్లో సూది దొరికితే 6 కిలోల చక్కెర, 6 కిలోల బెల్లం నైవేద్యంగా పెట్టి, 600 కొబ్బరి కాయలు కొడుతా అని మొక్కింది. ఆ మాటలు అక్కడే ఉండి విన్న కోడలు.. ఏంటి అత్తా అట్లా మొక్కావెందుకని అత్తను తిట్టింది. హుషారు పరురాలైన ఆ అత్త.. కోడలా నీకే బుద్ధి లేదు. సూది దొరకని, ఆ తరువాత చూద్దాం. దేవుడు వస్తాడా.. నన్నేమైనా పట్టుకుంటాడా.. అని అత్త చెప్పింది'. కాంగ్రెస్ పార్టీ నేతల తీరు కూడా ఇలాగే ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. 60 ఏళ్లు కరెంటు, నీళ్లు, ఇవ్వకుండా ప్రజలను ఇబ్బంది పెట్టిన ఆ పార్టీని ఓట్లతోనే బొంద పెట్టాలని పిలుపునిచ్చారు.

ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఇలా..

నల్లగొండలో..

- నల్లగొండ పట్టణంలోని మర్రిగూడ బైపాస్ వద్ద రూ.45 కోట్లతో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన
- రూ.146 కోట్లతో నల్లగొండ పట్టణంలో రోడ్ల విస్తరణ, మీడియన్, సెంట్రల్ లైటింగ్ ప్రారంభం
- మునుగోడు నియోజకవర్గంలోని గట్టుప్పల్, తేరట్‌పల్లి చేనేత క్లస్టర్లలోని పలువురు చేనేత కార్మికులకు మగ్గాల పంపిణీ.
- రూ.90.61 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నల్లగొండ కళాభారతి, రూ.139.21 కోట్ల వ్యయంతో ఉదయసముద్రం ట్యాంక్‌బండ్ సుందరీకరణ, రూ.55 కోట్ల వ్యయంతో పట్టణంలోని అన్ని వార్డులు, విలీన గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి, రూ.56.75 కోట్ల వ్యయంతో అమృత్ 2.ఓ మిషన్ భగీరథ పథకం పనులు, రూ.216.19 కోట్ల వ్యయంతో యూజీడీ పనులు, రూ.6.25 కోట్ల వ్యయంతో గడియారం సెంటర్‌లో నిర్మించనున్న ఆరు సూట్ల అతిథిగృహం, రూ.6 కోట్ల వ్యయంతో కలెక్టరేట్ వద్ద నిర్మించినున్న ఆర్‌అండ్‌బీ డివిజన్ కార్యాలయం, రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వేర్‌హౌజింగ్ కమర్షియల్ కాంప్లెక్స్ పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు.
- రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సుభాష్‌చంద్రబోస్ విగ్రహ జంక్షన్‌ను, రూ.1.66 కోట్ల వ్యయంతో నిర్మించిన షెల్టర్ ఫర్ అర్బన్ హోంలెస్, రూ.1.11 కోట్ల వ్యయంతో నిర్మించిన రైతుబజార్, రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జంక్షన్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు.

సూర్యాపేటలో..

- సూర్యాపేటలో ఐటీ హబ్, రూ.118 కోట్లతో నిర్మించిన ఎస్టీపీ (సేవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్), రూ.4కోట్లతో నిర్మించిన మున్సిపల్ కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు.
- రూ.316 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, మోడ్రన్ ధోబీఘాట్, ఎఫ్‌ఎస్‌టీపీ పనులకు శంకుస్థాపన చేశారు.



నల్లగొండలో ఐటీ టవర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో మంత్రి జగదీష్‌రెడ్డి

కాంగ్రెస్ మాటలు ప్రజలు నమ్మరు

- మంత్రి జగదీష్‌రెడ్డి



నల్లగొండ, సూర్యాపేట : కాంగ్రెస్ పార్టీ నాయకులు దొంగ మాటలను ప్రజలు నమ్మరని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట, నల్లగొండ జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అభివృద్ధి చెందలేదన్నారు. ఈ మధ్యకాలంలో కాంగ్రెస్ నేతలు నల్లగొండలో తననే గెలిపిస్తారని.. సాగర్‌లో తనకే ఓటు వేస్తారని మరొకరు చెప్పుకుంటున్నారని.. హుజూర్‌నగర్‌లో ఒకరు గడ్డం తీసుకోలేదని ఎద్దేవా చేశారు. నల్లగొండలో ఫ్లోరోసిస్‌ను పెంచి పోషించినందుకు మిమ్మల్ని గెలిపిస్తారని నిలదీశారు. నల్లగొండను దత్తత తీసుకుంటానని చెప్పిన సీఎం కేసీఆర్ ఒక్కరోజులోనే రూ.1000 కోట్లు మంజూరు చేసి మంత్రి కేటీఆర్‌ను పంపించారని పేర్కొన్నారు. ఇప్పుడు నల్లగొండ అంతా పూల వనంలా అభివృద్ధి చెందిందని అన్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చదవకుండానే ఇంజనీరింగ్ చదివానని ఐటీ మంత్రిగా పనిచేశారని, కానీ ఆయనకు కంప్యూటర్ ఆన్ చేయడం కూడా తెలియదని ఎద్దేవా చేశారు. ఉమ్మడి జిల్లాలోని 12 స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రూ.7500 కోట్లతో సూర్యాపేట అభివృద్ధి..

సూర్యాపేటలో కూడా 200 మందితో ప్రారంభించుకున్న ఐటీ పరిశ్రమను రాబోయే మూడేళ్లలో 5000 మందికి విస్తరిస్తామని తెలిపారు. ఎక్కడా లేనివిధంగా ప్రతి పట్టణంలో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, ఎప్పుడూ వినని ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు వెలుస్తున్నాయన్నారు. దశాబ్దాలుగా సూర్యాపేట ప్రజలను వేధించిన సాగు, తాగునీటి సమస్యల నుంచి విముక్తి కల్పించిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీదే అన్నారు. రూ.7500 కోట్లతో సూర్యాపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు.

సీఎం దత్తతతో బంగారు కొండయింది..

- నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల



నల్లగొండ : 60 ఏళ్లు అభివృద్ధికి దూరంగా ఉన్న నల్లగొండ సీఎం కేసీఆర్ దత్తతతో బంగారు కొండగా మారిందని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ఎన్జీ కళాశాలలో జరిగిన ప్రగతి నివేదన సభలో ఆయన మాట్లాడుతూ నల్లగొండను దత్తత తీసుకుంటానని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రూ.1350 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఐటీ హబ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రోడ్లు, సెంట్రల్ లైటింగ్‌తో పాటు ఎన్నో అభివృద్ధి పనులను ప్రారంభించుకున్నామని చెప్పారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జంక్షన్ల వద్ద పర్జలు సెల్ఫీలు దిగుతున్నారని, అభివృద్ధి అయిందో కాలేదో మీరే చెప్పాలని ప్రజలను కోరారు. ఇంకా అభివృద్ధి పనులు మిగిలిపోయాయని, మరో రెండేళ్లలో పూర్తవుతాయని.. అందుకు మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని ప్రజలను అభ్యర్థించారు. నలగొండ అభివృద్ధి కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉన్నానని అన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే మిర్యాలగూడ అభివృద్ధి



మిర్యాలగూడ కళాభారతి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

మిర్యాలగూడ : మిర్యాలగూడ నియోజకవర్గం బీఆర్‌ఎస్ హయాంలో అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం మిర్యాలగూడ నియోజకవర్గంలో రూ.311 కోట్లతో చేపట్టిన పనులకు నల్లగొండలోని ఎన్‌జీ కళాశాలలో నుంచి విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే భాస్కర్‌రావులతో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూ.30 వేల కోట్లతో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.7,600 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అధిక నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మిర్యాలగూడ నియోజకవర్గంలో మూడోసారి నల్లమోతు భాస్కర్‌రావును ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు.

మున్సిపల్ కమిషనర్‌తో నేడు ఫోన్‌ఇన్

హాలియా మున్సిపాలిటీలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పారిశుద్ధ్యం లోపించింది. పట్టణంలోని దోమల బెడద ఎక్కవ కావడంతో వివిధ కాలనీ ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. పట్టణంలో పలుచోట్ల ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరి ఇబ్బందిగా మారుతోంది. పారిశుద్ధ్యం, డ్రైయినేజీ, మంచినీరు, వీధిలైట్లు తదితర సమస్యలను ప్రజలు మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. మీ ప్రశ్నలకు కమిషనర్ సమాధానం ఇస్తారు.

తేదీ : 03-10-2023 (మంగళవారం)

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ : **99896 48489**




కందిమల్ల వీరారెడ్డి, మున్సిపల్ కమిషనర్, హాలియా

మూడు షిఫ్టుల్లో 3400 మంది పనిచేయొచ్చు

- ఐటీ హబ్ ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్

నల్లగొండ టూటౌన్ : నల్లగొండలో నిర్మించిన ఐటీ టవర్‌లో మూడు షిఫ్టుల్లో 3400 మంది ఉద్యోగులు పని చేయవచ్చని, రెండు షిఫ్టుల్లో 2300 మంది ఇక్కడ ఉద్యోగాలు చేయడానికి అవకాశం ఉందని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. నల్లగొండలో రూ.90 కోట్లతో నిర్మించిన ఐటీ టవర్‌ను సోమవారం విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ హైదరాబాద్ మాదిరిగానే నల్లగొండలో ఐటీ టవర్ నిర్మించామన్నారు. ఐటీ హబ్ ఒక్కటే కాకుండా ఇక్కడ టీ హబ్, టీ సాట్ సెంటర్‌లు ఏర్పాటు చేసి యువతకు స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఐటీ ఉద్యోగులతో మంత్రి కేటీఆర్ ముఖాముఖి మాట్లాడారు.



ఐటీ టవర్స్‌లో ఐటీ ఉద్యోగులతో మాట్లాడుతున్న మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి చిత్రంలో కలెక్టర్ కర్ణన్, నల్లగొండ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

గులాబీ శ్రేణుల జోష్

- ప్రగతి నివేదన సభకు భారీగా తరలి వచ్చిన పార్టీ కార్యకర్తలు



సభకు తరలివస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : బీఆర్‌ఎస్ ప్రగతి నివేదన సభ నేపథ్యంలో నల్లగొండ పట్టణం గులాబీమయమైంది. పట్టణంలో అడుగడుగునా గులాబీ జెండాలు రెపరెలాడాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నల్లగొండను దత్తత తీసుకుని అభివృద్ధి పనులకు రూ.1350 కోట్లు మంజూరు చేయించారు. దీంతో ఏడాది కాలం నుంచి జిల్లా కేంద్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పలు అభివృద్ధి పనులకు సోమవారం మంత్రి కేటీఆర్ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఆ తరువాత ప్రగతి నివేదన సభలో మాట్లాడారు. ఐటీ హబ్ ప్రారంభించేందుకు కేటీఆర్ రావడంతో నల్లగొండ బైపాస్‌రోడ్డు వద్ద ఆయనకు యువత పెద్దఎత్తున స్వాగతం పలికింది. ఆయన వాహనానికి ఇరువైపులా ఉండి పూలు చల్లుతూ ఐటీ హబ్ వరకు తీసుకెళ్లింది. దీంతో రోడ్డంతా పూల దారిగా మారింది. అంతకు ముందు మర్రిగూడ బైపాస్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతోపాటు అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు రోడ్డుపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు. ఆ తరువాత ఐటీ హబ్‌లో ఐటీ కంపెనీల ప్రతినిధులు, కొత్తగా జాబ్‌లు పొందిన వారితో మాట్లాడారు. కేటీఆర్ నల్లగొండ పర్యటన నేపథ్యంలో అడుగడుగునా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, గులాబీ తోరణాలు ఏర్పాటు చేశారు.

సభా ప్రాంగణంలో కిక్కిరిసిన జనం..

ఎన్‌జీ కళాశాలలో నిర్వహించిన ప్రగతి నివేదన సభకు నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున జనం తరలివచ్చారు. గులాబీదండులా కదలి రావడంతో రోడ్లు అన్ని కిక్కిరిసిపోయాయి. సభా ప్రాంగణం అంతా నిండిపోయి జనాలు బయట రోడ్లపై ఉండిపోయారు. సభా ప్రాంగణంలో పెద్దపెద్ద ఫ్లెక్సీలు, కేటీఆర్, మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే కటౌట్లు ఏర్పాటు చేశారు. మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతున్నంతసేపు సభాస్థలి కేరింతలు, చప్పట్లతో మార్మోగింది. సభకు నల్లగొండ నియోజకవర్గంలోని కనగల్, తిప్పర్తి, నల్లగొండ మండలాలతోపాటు, నల్లగొండలోని ప్రతి వార్డు నుంచి పార్టీ శ్రేణులు సభకుతరలి వచ్చాయి. మధ్యాహ్నం రెండు గంటలకే జనం ఎన్‌జీ కాలేజీ గ్రౌండ్ సగానికిపైగా నిండిపోయింది.

క్లుప్తంగా

గుండెపోటుతో ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ మృతి


నాగరాజు (ఫైల్)

నాగార్జునసాగర్: సాగర్‌డ్యాం ప్రత్యేక రక్షణదళం (ఎస్పీఎఫ్) కానిస్టేబుల్ కొమ్మరాజుల నాగరాజు(29) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. విధి నిర్వహణలో ఉండగానే గుండె పోటు రావడంతో తోటి సిబ్బంది స్థానిక కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. నాగరాజు సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల గ్రామానికి చెందిన వ్యక్తిగా తోటి ఉద్యోగులు తెలిపారు.

నేరేడుచర్లలో విషాదం

నేరేడుచర్ల : నాగార్జునసాగర్ డ్యాంపై స్పెషల్ బ్రాంచి కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నేరేడుచర్లకు చెందిన కొమ్మరాజు నాగరాజు(35) సోమవారం గుండెపోటుతో మృతి చెందడంతో మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నాగరాజు మృతిని తెలుసుకున్న స్నేహితులు, బంధువులు పెద్ద సంఖ్యలో మృతుడి ఇంటికి తరలివచ్చారు. నాగరాజుకు మహబుబాబాద్ జిల్లా కొరివి మండలం గుండ్రాతిమడుగుకు చెందిన భవానితో గత సెప్టెంబరు 7న వివాహమైంది. నాగరాజు మృతదేహం వద్ద భార్య భవానితో పాటు తల్లిదండ్రులు పెద వెంకటయ్య, పుల్లమ్మ గుండెలవిసేలా రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కానిస్టేబుల్ నాగారాజు అంత్యక్రియలు మంగళవారం నేరేడుచర్లలోనే జరగనున్నాయని బంధువులు పేర్కొన్నారు.

ఉరేసుకుని ఆత్మహత్య

చౌటుప్పల్ : మండల పరిధిలోని ఖైతాపురం గ్రామంలో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పెరుమాండ్ల నగేష్(35) తన ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని మరో గదిలో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులు అర్ధరాత్రి సమయంలో గమనించి పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడి భార్య చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.దేవేందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

నార్కట్‌పల్లి : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు గ్రామ పంచాయతీ పరిధి లోని ఏడుమోట్లబావి గ్రామ సమీ పంలో చోటుచేసుకుంది. పోలీలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లి మండలంలోని అక్కెనపల్లి గ్రామానికి చెందిన ఆకుల రవి (38) బైక్‌పై రామనుజపురం గ్రామం నుంచి భార్యతో కలసి వస్తుండగా మార్గమధ్యలో ఏడుమోట్లబావి గ్రామ సమీపాన ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఆకుల రవి తలకి బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందగా భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదబాబు తెలిపారు.

ఇంట్లో చోరీ.. పట్టుబడిన దొంగ

పాలకవీడు: తాళం వేసిన ఇంట్లోకి చొరబడి నగదు, బంగారం చోరీ చేసి పారిపోతున్న దొంగను పట్టుకున్నారు. ఈ ఘటన మండలంలోని జాన్‌పహాడ్ దర్గా సమీపంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దర్గా సమీపంలో నివాసముంటున్న షేక్ సైదావలి కుటుంబం వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వచ్చే సరికి తలుపులు తీసి ఉండడాన్ని గమనించాడు. ఆ సమయంలో ఇంటిగోడ దూకి పారిపోతున్న దొంగను గమనించి వెంబడించాడు. దుండగున్ని పట్టుకుని ఇంట్లో చోరీ చేసిన లక్షాయాభైవేల నగదు, మూడు తులాల బంగారు ఆభరణాలు, వెండి పట్టీలు స్వాధీనపరుచుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఇంచార్జి ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి వివరాలు నమోదు చేసుకుని దొంగను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు


నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో ప్రగతి నివేదన సభలో ప్రసంగిస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో మంత్రి జగదీష్‌రెడ్డి, జెడ్పీచైర్మన్లు, బండా నరేందర్ రెడ్డి, ఎలిమినేటి సందీప్ రెడ్డి, ఎమ్మెల్యేలు తదితరులు


నల్లగొండలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు


నల్లగొండ : ఐటీ హబ్ వద్ద బీఆర్ఎస్ కార్యకర్తల కోలాహలం


నల్లగొండలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి


సూర్యాపేట : ప్రగతి నివేదన సభలో ప్రసంగిస్తున్న మంత్రి కేటీఆర్ చిత్రంలో మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంపీ బడుగుల, ఎమ్మెల్యేలు తదితరులు


జమ్మిగడ్డలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రుల కేటీఆర్, జగదీష్‌రెడ్డి


సూర్యాపేటలో ఐటీ హబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు కేటీఆర్, జగదీరెడ్డి తదితరులు


సూర్యాపేట : ఐటీ ఉద్యోగులతో ముచ్చటిస్తున్న మంత్రి కేటీఆర్

గాంధీ మార్గంలో పయనించాలి

• ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

నల్లగొండ : ప్రతి ఒక్కరూ గాంధీ చూపిన అహింసా మార్గంలో పయనించాలని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం నల్లగొండలోని ఆయన క్యాంపు కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచమంతా మహాత్ముని ఫొటోలు పెట్టుకున్నారు అంటే ఆయన చేసిన సేవ, పోరాటం గొప్పదన్నారు. కులమతాలకు అతీతంగా రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలను ఆదుకుంటామన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి కృషితో నల్లగొండకు యూనివర్సిటీ తీసుకొచ్చానని పేర్కొన్నారు.

నల్లగొండ.. నా ప్రాణం

అక్టోబర్ 2 గాంధీ జయంతిని పురస్కరించుకుని ఎన్నికల ప్రచారం మొదలుపెడుతున్నానిని కోమటిరెడ్డి ప్రకటించారు. నల్లగొండే నా ప్రాణం చివరి శ్వాస వరకు ఇక్కడి ప్రజలకు సేవ చేయాలనేది నా కోరిక అని ఎంపీ పేర్కొన్నారు. సిరిసిల్లలో 20వేల డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కట్టుకున్న కేటీఆర్ ,దత్తత నియోజకవర్గం నల్లగొండలో ఎన్ని కట్టారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు పెట్టడం, దళితబంధులు కమిషన్లకు అమ్ముకోవడమే ఇక్కడ ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి అంటూ విమర్శించారు. నిస్వార్థంగా, నిజాయితీగా పనిచేసిన నన్ను మరొకసారి మీకు సేవ చేసే అవకాశం ఇవ్వండని నల్లగొండ ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, పాల్గొన్నారు.

కాంగ్రెస్ పథకాలపై ప్రచారం చేయాలి

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కార్యకర్తలను కోరారు. సోమవారం నల్లగొండ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ మాయ మాటల్లో మరోసారి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మ య్య, ఎంపీపీ సుమన్, వైస్ ఎంపీపీ జిల్లపల్లి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడిని ఆదర్శంగా తీసుకోవాలి


నివాళులర్పిస్తున్న రాజేందర్‌రెడ్డి తదితరులు

చౌటుప్పల్ : సమాజమంతా మహాత్ముడు చూపిన బాటలో పయణించాలని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ట్రస్ట్, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ చైర్మన్ డాక్టర్ గున్నా రాజేందర్‌రెడ్డి తెలిపారు. అహింసా మార్గాన్ని నమ్ముకొని ముందుకు సాగితే శాంతి విరాజిల్లుతుందన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ 154వ జయంతి వేడుకలను సోమవారం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, ట్రినిటీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వాంత్ర్యాన్ని తీసుకురావంతో పాటు భవిష్యత్తులో దేశానికి కావాల్సిన అంశాలపై పరితపించేవారని గుర్తు చేశారు. ప్రతిపౌరుడు మహాత్ముడిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి, ప్రతినిధులు కేవీబీ కృష్ణారావు, డాక్టర్ ఉజ్జిని మంజుల, బొబ్బిళ్ల మురళి, వెన్‌రెడ్డి సంధ్య, యానాల రాధిక, పోలోజు శ్రీలత, బొబ్బిళ్ల సంధ్య, వనం మమత ఉన్నారు.

గాంధీ మార్గాన్ని అనుసరించాలి


పెద్దకాపర్తిలో గాంధీ గుడిలో పూజలు చేస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

చిట్యాల: సమాజంలోని ప్రతి ఒక్కరూ మహాత్మా గాంధీ చూపిన మర్గాన్ని అనుచరించాలని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ పరిధిలోని మహాత్మా గాంధీ గుడిలో సోమవారం జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మహాత్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జోగినిపల్లి శ్రీనివాస్‌రావు, పొన్నపాటి ఈశ్వర్‌రెడ్డి, వజ్రాల రామలింగచారిలకు జీవన సాఫల్య పురస్కారాలను ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గాంధీ గుడిని నిర్మించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఐఆర్ఎస్ భూపాల్‌రెడ్డి, గాంధీ గుడి మేనేజింగ్ ట్రస్టి శ్రీపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, జిల్లా మహిళ అధ్యక్షురాలు పందిరి గీతా రమేష్ పాల్గొన్నారు.

రోడ్డుపై లారీ బోల్తా.. ట్రాఫిక్‌కు అంతరాయం


రోడ్డు పైన పడిపోయిన లారీ

తుర్కపల్లి: తుర్కపల్లి మండలం తిర్మలాపూర్ గ్రామ శివారులోని అంజన్న గట్టు వద్ద సోమవారం లారీ బోల్తా కొట్టడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. సిద్దిపేట జిల్లా రామాయంపేట్ నుంచి మిర్యాలగూడ వైపు తవుడు లోడ్‌తో వెలుతున్న లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో జగదేవ్‌పూర్, భువనగిరి రోడ్డు పైన అడ్డంగా పడిపోయింది. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే లారీలు, బస్సులు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు రెండు క్రేన్ల సహాయంతో రోడ్డు మీద ఉన్న లారీని, బస్తాలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

బ్యాడ్మింటన్‌లో కాంస్య పతకం

మిర్యాలగూడ టౌన్ : హైదరాబాద్‌లో ఈ నెల 1న జరిగిన తెలంగాణ రాష్ట్ర రెండవ మినీ సబ్ జూనియర్ అండర్-11 షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్‌లో నల్లగొండ జిల్లా జట్టు ప్రతిభ కనబరిచింది. ఈ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 30టీంలు హాజరు కాగా నల్ల గొండ జట్టు నుంచి దిపక్‌నాయుడు, రుత్విక్‌లు కాంస్య పతకాలను సాధించినట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ తెలిపింది. వారిని జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామారావు, కార్యదర్శి రంగారావు, కోచ్ మారబోయిన రామకృష్ణ అభినందించారు.

హోటళ్లు, దాబాలపై అధికారుల దాడులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పలు హోటళ్లలో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో, దాబాలపై సోమవారం మున్సిపల్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రీన్ బకెట్ మెస్‌కు రూ.2 వేలు, మురళీ మెస్‌కు రూ.1000, అన్నపూర్ణ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌కు రూ.1000 జరిమానా విధించా రు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సి బ్బంది ఖదీర్, లక్ష్మ ణ్, రాములు, సో మయ్య ఉన్నారు.

యథేచ్ఛగా మద్యం విక్రయాలు

గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వం మద్యం దుకాణాలను బంద్ చేసినా తిరుమలగిరిలో యథేచ్ఛగా బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు ఊపందుకున్నాయి. ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మద్యం ఏరులై పారింది. మోత్కూరు రోడ్డు వైపు వైన్స్ పక్కనే ఉన్న ఓ దుకాణంలో వేకువజాము నుంచే మద్యం విక్రయాలు సాగాయి. మద్యం దుకాణాలు బంద్ ఉండటంతో బెల్టు షాపుల్లో రెట్టింపు ధరలకు విక్రయించారు. అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో ఇలా జరుగుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మట్టి కాళ్లతో వెళ్లొద్దని వారించిన వ్యక్తిపై దాడి

• తలకు గాయమై అక్కడికక్కడే మృతి

బీబీనగర్: మట్టి, బురద కాళ్లతో ఇంటి వరండా ముందు నుంచి పైఅంతస్తుకు తరుచూ తిరుగుతున్న ఇద్దరిని వారించిన వ్యక్తిపై దాడి చేయడంతో తలకు గాయమై ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన బీబీనగర్ మండలంలోని జమీలాపేటలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ యుగేంధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జమీలాపేట గ్రామానికి చెందిన సయ్యద్ సలీం(60) అదే గ్రామంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని శుభ్రం చేస్తున్నాడు. ఈ సమయంలో అద్దె ఇంటి పైన మరో అంతస్తులో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో పనికి వచ్చిన భవన నిర్మాణ కార్మికులు లలిత్, అమర్‌లు శుభ్రం చేసిన వరండా నుంచి నుంచిపైకి కిందకు మట్టి, బురద కాళ్లతో నడుచుకుంటూ వెళ్తుండడంతో గమనించిన సలీం వారిని మందలించాడు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో సలీమ్‌ను ఇద్దరు కలిసి గోడకు నెట్టివేయడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. గొడవను గమనించిన సలీం భార్య అమీనా బేగం, ఇరుగుపొరుగు వారు అక్కడి చేరుకొని గాయపడిన సలీంను ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లగా మృతిచెందినట్లు ధ్రువీకరించాడు. విషయం తెలుసుకున్న భవన నిర్మాణ కార్మికులు లలిత్, అమర్ అక్కడి నుంచి పారిపోయారు. మృతుడి కుమారుడు సమీర్ ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గాంధీ మార్గమే నేటి తరానికి స్ఫూర్తి


ఎంజీయూలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న వీసీ గోపాల్‌రెడ్డి

నల్లగొండ రూరల్ : గాంధీ చూపిన శాంతి, అహింసా మార్గమే నేటి తరానికి స్ఫూర్తి దాయకమని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి, బెటాలియన్ కమాండెంట్ సత్య శ్రీనివాస్‌రావు, ఏఎస్పీ హన్మంతరావు అన్నారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా ఎంజీయూలో వీసీ, జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ హన్మంతరావు గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అసహనం, అశాంతి, స్వార్థం, అవినీతి మయమైన సమాజానికి గాంధీ మార్గం దిక్సూచి అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గాంధీ స్ఫూర్తితో అనేక పోరాటాలు జరిగి గొప్ప ఫలితాలు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీలు సోమ్‌నారాయణసింగ్, శ్రీనివాసులు, రమేశ్, వెంకన్న పాల్గొన్నారు.

కేటీఆర్ సభకు పోలీసుల పటిష్ట భద్రత

నల్లగొండ క్రైం : రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో పోలీసులు పటిష్ట భద్ర ఏర్పాటు చేశారు. మంత్రి కేటీఆర్ సోమవారం మధ్యాహ్నం 3గంటల 8 నిమిషాలకు అన్నెపర్తి బెటాలియన్‌కు హెలిప్యాడ్‌లో చేరుకున్నారు. బెటాలియన్‌లో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, ఎస్పీ అపూర్వరావు, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఇతర నాయకులు స్వాగతం పలికారు. బెటాలియన్ నుంచి మంత్రి కారులో పట్టణంలోకి చెరుకుని పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. భద్రతా పరంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్పీ, ఏఎస్పీ, 6గురు డీఎస్పీలు, 16 మంది సీఐలు, 60 మంది ఎస్ఐలు బందోబస్తు లో పాల్గొన్నారు. టపాసులు కాల్చిన సమయంలో నిప్పు రవ్వలు మీద పడటంతో ప్రజలు అసహనానికి గురయ్యారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే సభా ప్రాంగణంలోకి అనుమతించారు. మంత్రి సభ ముగిసిన తర్వాత సాయంత్రం 6 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు వెళ్లారు.

ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన.. వక్కవంతుల

• తెలంగాణ సాహిత్య అకాడామీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్


మాట్లాడుతున్న జూలూరు గౌరీ శంకర్

కోదాదరూరల్ : తెలంగాణ ముఖద్వారంలో మలిదశ ఉద్యమ స్ఫూర్తిని రగిలించడానికి వక్కవంతుల విజయ్‌కుమార్ చేసిన కృషి చిరస్మణీయమని తెలంగాణ సాహిత్య అకాడామీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని తమ్మరలో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, న్యాయవాది వక్కవంతుల విజయ్‌కుమార్ సంతాప సభలో ఆయన చిత్రటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. ప్రగతిశీల ఉద్యమాల నుంచి వచ్చిన వారు ఏ సమస్యనైనా పరిష్కరించగలుగుతారని అందులో ఒకరు విజయ్‌కుమార్ అని అన్నారు. ఉద్యమల గడ్డ కొక్కిరేణికి చెందిన విజయ్‌కుమార్ నాడు కేసీఆర్ పిలుపుతో ఆంధ్ర సంస్కృతికి దగ్గరగా ఉన్న కోదాడలో తెలంగాణ వాదాన్ని ఒక్కడే భుజాన వేసుకొని ప్రత్యేక రాష్ట్రం వచ్చేంత వరకు ఆందోళన చేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. విద్యార్థి ఉద్యమాలకు కేంద్రబిందువైన కోదాడ కేఆర్‌కెఆర్ కళాశాలలో విద్యను కొన సాగిస్తూనే విద్యార్థి పంథాల్లో చైతన్యవంతమైన నాయకుడిగా సమస్యలపై పోరాడేవారన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ కోదాడ నుంచి సాగర్ వరకు చేపట్టిన పాదయాత్రలో ఆయనవెంట ఉండి అత్యంత సన్నిహితులుగా గుర్తింపు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. అదే విధంగా జిల్లా మంత్రి జగదీష్‌రెడ్డి క్లాస్‌మేట్‌గా ఉండి అనేక విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, బీఆర్ఎస్ మాజీ నియోజకవర్గ అధ్యక్షుడు కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, దేవబత్తిని నాగార్జున, దొడ్డా నారాయణరావు, ములకలపల్లి రాములు, చిత్తలూరి సత్యనారాయణ, పగడాల రామచంద్రారెడ్డి, రాయపుడి చిన్ని, గంధం బంగారు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, ఓరుగంటి ప్రభాకర్, కనగాల వెంకటరామయ్య ఉన్నారు.

యాదాద్రిలో కొనసాగుతున్న భక్తుల రద్దీ


ఉత్తర మాఢవీధిలో భక్తుల కోలాహలం

యాదగిరిగుట్ట: వరుస సెలవులతో యాదాద్రి పుణ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. ఆదివారం, ఆ వెంటనే గాంధీ జయంతి సెలవు రావడంతో యాదాద్రీశుడి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం రాత్రి నుంచే భక్తులు భారీగా యాదాద్రికి చేరుకున్నారు. దీంతో సోమవారం ఉదయం నుంచే భక్తులు స్వామి వారి దర్శనానికి క్యూకట్టారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, బస్టాండ్లు నిండిపోయాయి. ధర్మదర్శనానికి సుమారు 4గంటలు, వీఐపీ దర్శనానికి 2గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. క్యూకాంప్లెక్స్‌లో ఉక్కపోతతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. కనీస సౌకర్యాలు కరువయ్యాయని అధికారులపై భక్తులు మండిపడ్డారు. ఇక లక్ష్మీనర్సింహ స్వామి ఆలయానికి సోమవారం నిత్యాదాయం రూ.56,18,814 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నాగారం : మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో ఈనెల 5న జరిగే సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ, గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళన సభ, సేఫ్టీ మోకుల పోస్టర్లను సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొల్కపురి శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ మామిడిపల్లి గ్రామంలో జరిగే సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ, గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళన సభకు బహుజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టూరిజం శాఖ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, చిత్తలూరి కృష్ణమూర్తిగౌడ్, నరేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలి

• సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

చౌటుప్పల్ : ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మండల పరిధిలోని ఎస్.లింగోటం గ్రామంలో సోమవారం నిర్వహించిన సీపీఎం పార్టీ మండల రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నో రకాల హామీలను ఇచ్చి గద్దెనెక్కిన బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందిమాత్రం శూన్యమన్నారు. కులం, మతం పేరుతో ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీస్తుందని ఆరోపించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయడంలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతున్నారని ధ్వజమెత్తారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన మునుగోడు నియోజకవర్గ ఉప ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీ కమ్యూనిస్టులను వాడుకొని వదిలేసిందన్నారు. అవకాశవాద రాజకీయాలకు బీఆర్ఎస్ తెరలేపిందని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ప్రజలతో కలిసి ప్రభుత్వాలపై ప్రజా పోరాటాలు నిర్వహించాలని సీపీఎం శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గంగదేవి సైదులు, నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, ఎండి.పాష, గడ్డం వెంకటేశం, తడక మోహన్, చీరిక సంజీవరెడ్డి, రాగీరు కిష్టయ్య, చిట్యాల బుచ్చిరెడ్డి, జక్కిడి రాండ్డి, కందాల రవీందర్‌రెడ్డి, బొజ్జ బాలయ్య, బీమిడి ప్రభాకర్‌రెడ్డి, పొట్ట శ్రీను, పల్లె మధుకృష్ణ, కొండె శ్రీశైలం, చెన్నబోయిన వెంకటేశం ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ప్రశంసారాజ్

నడిగూడెం, మునగాల : నడిగూడెం మండల కేంద్రానికి చెందిన చిత్తులూరి ప్రశంసారాజ్ గత నెల 30, ఈ నెల 1న కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌లో 60 మీటర్ల పరుగు పోటీలు, ట్రియాలిన్‌లో చాంపియన్‌గా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు సూర్యాపేట జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఈ నెల 15,16,17 తేదీల్లో హన్మకొండలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో చిత్తులూరి ప్రశంసారాజ్ పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రశంసారాజ్ గచ్చిబౌలిలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపూరి రమేష్, వద్ద ఆమె శిక్షణ తీసుకుంటున్నట్లు తెలిపారు.